
సాక్షి ఖమ్మం

మంగళవారం । 11 । జూలై । 2023



తాగునీటి ఎద్దడి ఎదురుకావొద్దు

జిల్లాలో ఎక్కడ కూడా తాగునీటి ఎద్దడి రాకుండా అధికారులు పర్యవేక్షించాలని కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు. 8లో



మరో మణిహారం

బూర్గంపాడు మండలం సారపాకలోని జీపీఎల్ కర్మాగారం భారీ పెట్టుబడితో విస్తరణకు రంగం సిద్ధమవుతోంది. 8లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం
36° / 25°

జిల్లా అంతటా మంగళవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలు ప్రాంతాల్లో ఓ మోస్తరు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

కలెక్టర్‌ను కలిసిన సింగరేణి జీఎం



కలెక్టర్ గౌతమ్‌ను సన్మానిస్తున్న జీఎం

సత్తుపల్లి: సింగరేణి కొత్తగూడెం ఏరియా జీఎంగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఎం.షాలేం రాజు సోమవారం ఖమ్మంలో కలెక్టర్ వీ.పీ.గౌతమ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సత్తుపల్లి ఏరియాలోని గనులకు కావాల్సిన భూసేకరణ, పరిహారం, ఆర్అండ్ ఆర్ పనులపై చర్చించారు. ఈ విషయంలో రెవెన్యూ శాఖ తరఫున సహకరించాలని జీఎం కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఎస్టేట్స్ ఆఫీసర్ తావుర్యా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాప్యంలో వారసులు పట్టించుకోవడం లేదు..



వృద్ధుల సమస్యలు తెలుసుకుంటున్న సీపీ వారియర్


ఖమ్మంక్రైం: వృద్ధాప్యంలో తమను వారసులు పట్టించుకోకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని పలువురు తల్లిదండ్రులు మొరపెట్టుకున్నారు. పోలీసు కమిషనరేట్‌లో సోమవారం జరిగిన గ్రీవెన్స్ డేలో పలువురు ఈ విషయమై సీపీ విష్ణు ఎస్.వారియర్‌కు ఫిర్యాదు చేశారు. అలాగే, భూవివాదాలు, కుటుంబ, వ్యక్తిగత సమస్యలతోపాటు, ఆర్థిక లావాదేవీలపై ఎక్కువగా ఫిర్యాదులు అందాయి. ఈమేరకు ఫిర్యాదులను క్షేత్ర స్థాయిలో విచారించి చట్టపరిధిలో చర్యలు తీసుకోవాలని అధికారులను సీపీ వారియర్ ఆదేశించారు.

కానిస్టేబుల్ కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా చెక్కు

గత ఏడాది అక్టోబర్ 7న అనారోగ్యంతో మృతి చెందిన ఎర్రుపాలెం కానిస్టేబుల్ రవికుమార్ కుటుంబసభ్యులకు మంజూరైన రూ.3.46లక్షల భద్రత ఎక్స్‌గ్రేషియా చెక్కును సీపీ విష్ణు ఎస్.వారియర్ అందజేశారు. ఈసందర్భంగా సీపీ మాట్లాడుతూ శాఖాపరంగా ఎలాంటి సహాయ సహకారాలు అందించేందుకైనా పోలీసు అధికారులు అందుబాటులో ఉంటారని ఆయన తెలిపారు.

స్పోర్ట్స్ స్కూళ్లలో ఎంపికకు 12నుంచి పోటీలు

ఖమ్మం స్పోర్ట్స్: స్పోర్ట్స్ స్కూళ్లలో ప్రవేశాలు కల్పించేందుకు ఈనెల 12, 13 తేదీల్లో జిల్లా స్థాయి ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు డీవైఎస్ఓ ఎం.పరంధామరెడ్డి తెలిపారు. ఇప్పటికే మండలస్థాయిలో నిర్వహించిన పోటీల్లో విజేతలు ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో జరిగే జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. ఈమేరకు 4, 5వ తరగతుల్లో ప్రవేశాలకు నిర్వహిస్తున్న పోటీలకు హాజరయ్యే వారు వయసు ధృవీకరణ పత్రంతో పాటు ఆధార్ కార్డు, కుల ధృవీకరణ పత్రం తీసుకురావాలని సూచించారు. ఇక్కడ ప్రతిభ కనబర్చిన వారిని ఈనెల 27వ తేదీన హకీంపేట స్పోర్ట్స్ స్కూల్‌లో జరుగు రాష్ట్రస్థాయి ఎంపిక పోటీలకు పంపిస్తామని తెలిపారు.



నూతన కలెక్టరేట్‌లోని డీఆర్‌డీఏ కార్యాలయం

డీఆర్‌డీఏలో దొంగలు పడ్డారు!

ఫిర్యాదులు అందడంతో..

కార్యాలయంలో సామగ్రి మాయమైన విషయమై కలెక్టర్‌కు ఫిర్యాదులు వెళ్లిన క్రమంలో ఇంటి దొంగలు అలర్ట్ అయ్యారు. ప్రధానంగా డీఆర్‌డీఓ చాంబర్‌లోని సోఫా సెట్ లేని విషయమై చర్చ జరుగుతుండడంతో గమనించి ఓ అధికారి, అటెండర్ రెండు పాత కుర్చీలు తీసుకొచ్చి సోఫాసెట్‌ను మరమ్మతులకు ఇచ్చామంటూ డీఆర్‌డీఓకు బిల్లు చూపించారు. దీంతో ఆమె తాను చెప్పనప్పుడు మరమ్మతులకు ఎలా ఇచ్చారని ఆగ్రహం వ్యక్తం చేస్తూ అటెండర్లకు మెమోలు జారీ చేశారు. అయితే పాత డీఆర్‌డీఏ కార్యాలయం నుంచి వచ్చిన మరికొంత సామగ్రి కూడా కొత్త కార్యాలయానికి చేరకపోవడం, గత ఏడాది ఆయిల్‌బాల్స్ కోసం కొనుగోలు చేసిన పెద్ద ప్లాస్టిక్ డబ్బాలు, టబ్‌లు సైతం మాయం కాగా... ఉపాధి కూలీలకు సంబంధించి నీడ పట్టాలను సైతం ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారి స్టోర్ నుంచి తన ఇంటికి తీసుకెళ్లినట్లు ప్రచారం జరుగుతోంది.

కలెక్టరేట్‌కు తరలించే సమయాన సామగ్రి మాయం

- జిల్లుల చెల్లింపుల్లోనూ కమీషన్ల కక్కుర్తి
- చక్రం తిప్పుతున్న అధికారి, అటెండర్

ఖమ్మంమయూరిసెంటర్: జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ కార్యాలయంలో దొంగలు పడ్డారు. అయితే, వీరు బయటి వారు కాకపోగా.. ఇంటి దొంగలే కావడం గమనార్హం. కార్యాలయంలో ఉండాల్సిన వస్తువులను మాయం చేయడమే కాక, ప్రతీ పనికి కమీషన్లు దండుకుంటున్నారనే విమర్శలు వస్తున్నాయి. డీఆర్‌డీఏలో ఏడాది కాలంగా ఇలాంటి ఆరోపణలు తరచుగా వస్తున్నాయి. తాజాగా సామగ్రి మాయమైన విషయమై కలెక్టర్‌కు ఫిర్యాదు అందడం చర్చనీయాంశంగా మారింది. కార్యాలయంలో పనిచేస్తున్న ఓ అధికారి, అటెండర్ ఈ తతంగానికి సూత్రధారులు కాగా... సామగ్రి మాయమవుతున్నా ఎవరూ పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

గమ్యం చేరని సామగ్రి

డీఆర్‌డీఏ కార్యాలయాన్ని వి.వెంకటాయపాలెంలోని నూతన కలెక్టరేట్(ఐడీఓసీ)కు మార్చే సమయాన తొలుత ముఖ్యమైన ఫైళ్లు, కంప్యూటర్లను మాత్రమే తరలించారు. ఆ తర్వాత అవసరమైన ఒక్కో సామగ్రిని విడతల వారీగా చేర్చారు. ఈ సమయంలో పాత డీఆర్‌డీఏ కార్యాలయంలో ఎన్నో ఏళ్లుగా ఉన్న డీజిల్ జనరేటర్, ఇన్వెర్టర్ బ్యాటరీలు, కాపర్ వైర్, కుర్చీలు, సోఫా సెట్లను బయటకు తీసుకొచ్చినా అవి ఐడీఓసీకి చేరలేదు. ఐదు నెలల తర్వాత ఈ విషయమై చర్చ మొదలు కావడం.. ఇంతలోనే కలెక్టర్‌కు ఫిర్యాదు అందడంతో అధికారులు ఆరా తీయడం మొదలు పెట్టారు. ఈ క్రమంలోనే డీఆర్‌డీఓ చాంబర్‌లోని సోఫా సెట్ కూడా కనిపించకపోవడంతో సిబ్బందిలో ఆందోళన మొదలైంది.

కమీషన్లకు కక్కుర్తి

కార్యాలయ అధికారి ఒకరు అంతా తానై డీఆర్‌డీఏలో చక్రం తిప్పుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. కార్యాలయంలోని సామగ్రి మాయం కావడం వెనుక కూడా ఆర్థిక వ్యవహారాలు చూసే అధికారిపైనే అనుమానాలు వచ్చాయి. కార్యాలయానికి సంబంధించిన బిల్లుల్లో చేతివాటం ప్రదర్శించినట్లుగా తెలుస్తుండగా, రెండు దఫాలుగా నిర్వహించిన దిశ కమిటీ సమావేశాల బిల్లులు కూడా ఖర్చయిన నగదు కంటే ఎక్కువగా సమర్పించడంతో జిల్లా అధికారులే అవాక్కయినట్లు తెలిసింది. గత ఏడాది సెప్టెంబర్‌లో జరిగిన దిశ కమిటీ సమావేశానికి సంబంధించి రూ.1.30 లక్షలకు పైగా ఖర్చు అయినట్లు బిల్లులు సమర్పించగా ఉన్నతాధికారులు కొద్దిరోజులు ఆపారు. ఈ ఏడాది మే నెలలో జరిగిన దిశ కమిటీ సమావేశంలో చైర్మన్, ఇతర ప్రముఖులకు బయట హోటల్ నుంచి భోజనం తెప్పించగా.. ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులకు ఐడీఓసీలోని క్యాంటీన్ నిర్వాహకుడికి కేటరింగ్‌కు ఇచ్చినట్లు తెలిసింది. ఈ భోజనం విలువ రూ.100 దాటకున్నా రూ.250 వరకు బిల్లులు సమర్పించినట్లు తెలుస్తోంది. ఇక కార్యాలయానికి సంబంధించిన పలు బిల్లుల్లో కూడా కమీషన్లకు తెరలేపినట్లు సమాచారం.

విచారణ చేయిస్తున్నాం..



కార్యాలయంలో సామగ్రి కనిపించకపోవడంపై విచారణ చేయిస్తున్నాం. ఇటీవల సోఫా సెట్ తిరిగి తెప్పించాం. ఫ్యాన్లు, లైట్లను అటెండర్లకు ఇచ్చామని అధికారులు చెబుతున్నారు. సామగ్రి మాయమయ్యాయనే ఆరోపణలతో అటెండర్లకు మెమో ఇచ్చాం. అలాగే, పూర్తిస్థాయిలో పరిశీలించాలని ఏఓకు సూచించాం.

– ఎం.విద్యాచందన, డీఆర్‌డీఓ

వాడల్లో కాదు.. ప్రజల గుండెల్లో ఉన్నా...



యువతికి లైసెన్స్ పత్రం అందజేస్తున్న మంత్రి పువ్వాడ అజయ్, పక్కన మేయర్ నీరజ, మార్కెట్ చైర్‌పర్సన్ శ్వేత, సుడా చైర్మన్ విజయ్‌కుమార్ తదితరులు

- అందుకే కొందరు ఓర్వలేకపోతున్నారు..
- లైసెన్స్‌ల పంపిణీలో మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

ఖమ్మంమయూరిసెంటర్: పువ్వాడ వాడల్లో కాదు ప్రజల గుండెల్లో ఉన్నాడని.. అది తెలియడంతో కొందరు ఓర్వలేకపోతున్నారని మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. పువ్వాడ ఫౌండేషన్ ఆధ్వర్యాన ఖమ్మంలోని తన క్యాంపు కార్యాలయంలో చేపట్టిన డ్రైవింగ్ లైసెన్స్ మేళా సందర్భంగా పలువురికి సోమవారం ఆయన లెర్నింగ్ లైసెన్స్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో మంత్రి పువ్వాడ మాట్లాడుతూ వాడవాడకు పువ్వాడ కార్యక్రమం ద్వారా అనేక సమస్యలు పరిష్కారమయ్యాయని తెలిపారు. కానీ ఇది తట్టుకోలేని కొందరు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ఆరోపించారు. సభ్యసమాజం తలదించుకునేలా రాజకీయాలు చేస్తే ప్రజల్లో వారే పలుచన అవుతారనే విషయాన్ని గుర్తుంచుకోవాలని అజయ్ కుమార్ హితవు పలికారు.

అందరూ లైసెన్స్ తీసుకోండి

రోడ్లపై వాహనాలు నడిపే ప్రతిఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ పొందాలని మంత్రి పువ్వాడ సూచించారు. అవగాహన లేక, డ్రైవింగ్ సరిగ్గా రాకుండా వాహనాలు నడిపే వారితో ప్రమాదాలు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. ఈమేరకు 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరు సురక్షితంగా వాహనాలు నడపడంపై అవగాహన పెంచుకుని లైసెన్స్ తీసుకోవాలని సూచించారు. కాగా, ప్రత్యేక మేళాలో ఇప్పటివరకు 259 మందికి లెర్నింగ్ లైసెన్స్‌లు జారీ అయ్యాయని, ఖమ్మం నగరం, రఘునాథపాలెం మండలాలకు చెందిన అర్హులు స్లాట్ బుక్ చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ, డీటీఓ కిషన్‌రావు, జిల్లా ఆర్టీఏ మెంబర్ వల్లభనేని రామారావు, సుడా చైర్మన్ విజయ్‌కుమార్, ఎంవీఐ వరప్రసాద్, మార్కెట్ చైర్‌పర్సన్ దోరెపల్లి శ్వేత, కార్పొరేటర్ నాగండ్ల కోటేశ్వరరావు, సర్పంచ్ మెంటెం రమారావు, నాయకులు గుండాల కృష్ణ, పైడిపల్లి సత్యనారాయణ, పాల్వంచ కృష్ణ, తన్నీరు శోభారాణి, తాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి పౌర స్మృతి బిల్లును వ్యతిరేకిస్తున్నాం

భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటుతూ ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిన భారత ప్రజల ఐక్యతను చీల్చేలా కేంద్రప్రభుత్వం తీసుకునే నిర్ణయాలను తాము నిర్ద్వంద్వంగా తిరస్కరిస్తామని అందులో భాగంగానే ఉమ్మడి పౌరస్మృతి(యూసీసీ) బిల్లును వ్యతిరేకిస్తున్నామని మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఒక ప్రకటనలో వెల్లడించారు. యూసీసీని వ్యతిరేకించాలని బీఆర్ఎస్ జాతీయ అధ్యక్షుడు, సీఎం కేసీఆర్ నిర్ణయించినట్లు తెలిపారు. దేశాభివృద్ధిని విస్మరించి ఇప్పటికే పలు రకాలుగా దేశ ప్రజల నడుమ చిచ్చు పెడుతున్న బీజేపీ ప్రభుత్వం.. ఉమ్మడి పౌర స్మృతి పేరుతో మరోమారు ప్రజలను విభజించేందుకు కుయుక్తులు పన్నుతోందని ఆరోపించారు. తెలంగాణలో కులాలు, మతాల మధ్య చిచ్చు పెడుతూ తమ రాజకీయ పబ్బం గడుపుకుంటున్న బీజేపీకి ప్రజలు తగిన రీతిలో బుద్ధి చెబుతారని చెప్పారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి



విద్యార్థులతో కలిసి పాఠం వింటున్న డీఈఓ శర్మ

కొణిజర్ల: మన ఊరు – మన బడి పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు మెరుగుపడిన నేపథ్యాన విద్యార్థులకు నాణ్యమైన విద్యనందిస్తూ తల్లిదండ్రులకు నమ్మకం కలిగేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈఓ ఈ.సోమశేఖరశర్మ సూచించారు. కొణిజర్లలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సోమవారం సాయంత్రం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా 8, 9, 10వ తరగతుల విద్యార్థులకు జరుగుతున్న డిజిటల్ బోధనను పరిశీలించారు. అనంతరం డీఈఓ మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లా ప్లానింగ్ కోఆర్డినేటర్ రామకృష్ణ, హెచ్‌ఎం దామాల పుల్లయ్యతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముత్తంగి అలంకరణలో రామయ్య

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారు ముత్తంగి అలంకరణలో భక్తుల కు దర్శనమిచ్చారు. ప్రతి సోమవారం స్వామి వారిని ఈ రూపంలో అలంకరించటం ప్రత్యేకత. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

19న జిల్లాకు ఓపీఎస్ రథయాత్ర



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఖమ్మం సహకారనగర్: ఓపీఎస్ సంకల్ప రథయాత్ర ఈనెల 19వ తేదీన జిల్లాకు చేరనుంది. ఈమేరకు రూపొందించిన పోస్టర్లను టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు అఫ్జల్‌హసన్ సోమవారం టీఎన్జీవోస్ ఫంక్షన్ హాల్‌లో ఆవిష్కరించారు. కాగా, టీఎస్ సీపీఎస్ఈయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 19వ తేదీన నిర్వహించే పాత పెన్షన్ సాధన సంకల్ప రథయాత్ర సభ, ఆగస్టు 12న చేపడుతున్న చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలని యూనియన్ బాధ్యులు కోరారు. టీఎస్ సీపీఎస్ఈయూ జిల్లా అధ్యక్షుడు చంద్రకంటి శశిధర్, నాయకులు కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఓపీఎస్ వర్తింపచేయాలి

2004 కంటే ముందే వెలుడిన నోటిఫికేషన్ ద్వారా నియమితులైన ఉపాధ్యాయులందరికీ పాత పెన్షన్ పథకం(ఓపీఎస్) వర్తింపజేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈమేరకు 2003 డీఎస్సీ ఉపాధ్యాయులు పాత పెన్షన్ పథకం వర్తింపచేయాలని కోరుతూ యూటీఎఫ్ జిల్లా కమిటీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ ఓపీఎస్ అమలు డిమాండ్‌తో ఈనెల 18, 19వ తేదీల్లో బైక్ ర్యాలీలు, వచ్చే నెల 12న నిరాహార దీక్షలు, సెప్టెంబర్ 1న పెన్షన్ విద్రోహ దినం సందర్భంగా ఇందిరాపార్క్ వద్ద మహా ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు పాల్గొని ప్రభుత్వానికి నిరసన తెలియజేయాలని కోరారు.

నేడు సాగర్ జలాలు విడుదల

ఖమ్మం అర్బన్: జిల్లాలోని పాలేరు రిజర్వాయర్‌లో నీరు అడుగంటుతున్న నేపథ్యాన అధికారులు ముందస్తు చర్యలకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా నాగార్జునసాగర్ ప్రధాన ఎడమ కాల్వ నుంచి పాలేరు రిజర్వాయర్‌కు మంగళవారం నీరు విడుదల చేయనున్నారు. సాగర్ డ్యామ్ నుంచి రోజుకు 4వేల క్యూసెక్కుల నీటిని మూడు రోజుల పాటు వదలనుండగా.. రిజర్వాయర్, చెరువులు నింపేందుకు ఏర్పాట్లు చేశారు.

జలవనరుల శాఖ డీఈ బదిలీ

జలవనరుల శాఖ ఖమ్మం రూరల్ డీఈ వెంకటశాస్త్రి ములుగు జిల్లా వెంకటాపురానికి బదిలీ అయ్యా రు. దీంతో పాలేరు డీఈ మన్మథరావుకు ఖమ్మం రూరల్ ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు.

ఫిర్యాదులు పెండింగ్‌లో ఉండొద్దు..

గ్రీవెన్స్ డేలో కలెక్టర్ గౌతమ్



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ గౌతమ్

ఖమ్మం సహకారనగర్: ప్రజలు అందించే ప్రతీ ఫిర్యాదులను పరిశీలించి త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం ఆయన ప్రజావాణి(గ్రీవెన్స్ డే)లో భాగంగా వివిధ ప్రాంతాల నుంచి ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతిపత్రాలు స్వీకరించారు. ఇందులో కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించగా మరికొన్నింటిని పరిశీలించాలని అధికారులకు అందజేశారు. అదనపు కలెక్టర్లు స్నేహలత మొగిలి, ఎన్.మధుసూదన్, అసిస్టెంట్ కలెక్టర్ రాధికాగుప్తా, డీఆర్వో శిరీష తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల్లో కొన్ని...

- రఘునాథపాలెం మండలం వి.వెంకటాయపాలెంకు చెందిన దివ్యాంగుడు నల్లగట్ల నాగరాజు తన ఇద్దరు పిల్లలకు బెస్ట్ అవైలబుల్ స్కూల్ పథకం కింద ప్రవేశాలు కల్పించాలని కోరారు.
- కొణిజర్ల మండలం ఎల్లన్ననగర్‌కు చెందిన పలువురు పోడు భూములకు పట్టాలు ఇప్పించాలని న్యూడెమోక్రసీ నాయకులతో కలిసి విన్నవించారు.
- వైరా మండలం స్నానాల లక్ష్మీపురం గ్రామంలోని తాగునీటి బోర్‌ను ఓ వ్యక్తి ఆక్రమించుకున్నాడని ఫిర్యాదు చేశారు.
- మధిరకు చెందిన షేక్ గౌసుద్దీన్ తన దివ్యాంగుల పింఛన్‌ను పునరుద్ధరించాలని, కొణిజర్ల మండలం పెద్దగోపతి వాసులు రియల్ ఎస్టేట్ వెంచర్ అనుమతిని రద్దు చేయాలని కోరారు.

దత్తత ఓ వరం


పిల్లలు లేని దంపతులకు దత్తత ఒక వరమని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ అన్నారు. జిల్లా బాలల సంరక్షణాలయానికి చెందిన బాబును 'కారా' నిబంధనల మేరకు ఇటలీకి చెందిన దంపతులు దత్తత తీసుకున్నారు. ఈ సందర్భంగా వారికి బాబును అప్పగించిన కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అనాథలు, వదిలివేయబడిన పిల్లలను చట్టప్రకారం దత్తత ప్రక్రియలోకి తీసుకొచ్చి www.cara.nic.in ద్వారా దరఖాస్తు చేసుకున్న వారికి దత్తత ఇస్తున్నట్లు తెలిపారు. అంతేతప్ప నిబంధనలకు విరుద్ధంగా పిల్లలను ఇచ్చిపుచ్చుకుంటే చర్యలు తీసుకుంటామని చెప్పారు. జిల్లా సంక్షేమ అధికారి జి.జ్యోతి, డీసీపీఓ విష్ణువందన, ప్రొటెక్షన్ అధికారి సోని తదితరులు పాల్గొన్నారు.

ముఖం చూపిస్తేనే హాజరు!

- వైద్య, ఆరోగ్యశాఖలో ఫేస్ బయోమెట్రిక్ అమలు
- తొలుత పీహెచ్‌సీల్లో వైద్యులు, ఉద్యోగులు.. ఆపై క్షేత్రస్థాయి సిబ్బందికి కూడా..
- ఉద్యోగులు, సిబ్బంది గైర్హాజరును అరికట్టేందుకు చర్యలు
- సాంకేతిక సమస్యలపై క్షేత్రస్థాయి సిబ్బంది నిరసన



సిగ్నల్ సరిగ్గా లేక బయోమెట్రిక్ నమోదుకు అవస్థ పడుతున్న వైద్య సిబ్బంది



ఫేస్ బయోమెట్రిక్ యాప్

జిల్లాలోని పీహెచ్‌సీలు, ఉద్యోగులు

పీహెచ్‌సీలు	26
ఏఎన్‌ఎంలు	384
వైద్యులు	54
సూపర్‌వైజర్లు	130
ఫార్మసిస్టులు, ఎల్‌టీలు	75
స్టాఫ్ నర్సులు	55

సత్తుపల్లిటౌన్: ఆస్పత్రుల్లో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తోంది. పీహెచ్‌సీల్లో అధునాతన పరికరాలు సమకూరుస్తుండడమే కాక వైద్యులు, సిబ్బందిని నియమిస్తోంది. ఇదే సమయాన సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహించకుండా హాజరు నమోదు కోసం 'ఫేస్ బయోమెట్రిక్ యాప్'ను ప్రవేశపెట్టింది. పైలెట్ ప్రాజెక్టుగా ఖమ్మం జిల్లాలో ఈ యాప్‌ను ప్రవేశపెట్టగా పనివేళలు సక్రమంగా అమలు చేయడం, గైర్హాజరీని అరికట్టడమే లక్ష్యమని చెబుతున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో వైద్యులు, సూపర్‌వైజర్లు, స్టాఫ్‌నర్సులు, ఇతర సిబ్బందికి ఈ యాప్ ద్వారా హాజరు నమోదును నెల రోజులుగా అమలు చేస్తున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా తాజాగా క్షేత్రస్థాయిలో పనిచేసే ఏఎన్‌ఎంలకు కూడా ఫేస్ బయోమెట్రిక్ అటెండెన్స్ తప్పనిసరి చేయటంతో నిరసన వ్యక్తమవుతోంది.

గుబులు పెట్టిస్తున్న బయోమెట్రిక్

గ్రామాల్లో ఇంటింటికీ తిరుగుతూ ఆరోగ్య సేవలు అందిస్తున్న ఏఎన్‌ఎంలకు ఫేస్ బయోమెట్రిక్ అటెండెన్స్ గుదిబండగా మారిందని చెబుతున్నారు. రోజురోజుకు పెరుగుతున్న ఆన్‌లైన్ సేవలు, ఆరోగ్య కార్యక్రమాల పనిభారంతో సతమతమవుతుంటే ఈ యాప్ మరింత భారం మోపుతోందని వాపోతున్నారు. ప్రతిరోజు ఉదయం 9గంటలకల్లా ఆరోగ్య ఉపకేంద్రాల్లో హాజరు నమోదు చేసి 10 నుంచి 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్రామాలకు వెళ్లి వైద్యసేవలందించాల్సి వస్తోంది. ఆపై సాయంత్రం 4 గంటలకు మళ్లీ ఆరోగ్య ఉపకేంద్రాలకు వెళ్లి అటెండెన్స్ వేయాలంటే వ్యయప్రయాసలకు గురికావాల్సి వస్తోందని ఆందోళన చెందుతున్నారు. క్షేత్ర స్థాయిలో తిరిగే ఏఎన్‌ఎంలు, వైద్య సిబ్బందికి ఈ హాజరు విధానంతో ఇబ్బందే తప్ప లాభమేమి లేదంటున్నారు. ఈనేపథ్యాన యాప్ హాజరును తొలగించాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఎదుట ఆరోగ్య సిబ్బంది ఆందోళనలు చేపడుతున్నారు. అటెండెన్స్ కోసం ఒక ఊరికి, వ్యాక్సిన్ కోసం మరో ఊరికి.. వ్యాక్సిన్ తీసుకురావటానికి పీహెచ్‌సీ ఉన్న ఊరికి వెళ్లి రావటం భారంగా మారిందని చెబుతున్నారు.

సర్వర్ సతాయిస్తోంది..

ఫేస్ బయోమెట్రిక్‌లో అటెండెన్స్ నమోదు చేయటం ఆరోగ్యశాఖ ఉద్యోగులకు కత్తిమీద సాములా మారింది. కనీసం అవగాహన కల్పించకుండా సెల్‌ఫోన్‌కు మెసేజ్‌లు పంపి యాప్ అటెండెన్స్ తప్పనిసరి చేయటంతో ఉద్యోగుల్లో గుబులు కలిగిస్తోంది. నెట్ సిగ్నల్ సరిగ్గా లేకపోయినా, లైటింగ్ సరిపడా లేకపోయినా హాజరు నమోదు కాకపోవడంతో అవస్థ పడుతున్నారు. ఎర్రర్ అంటూ తరచూ వస్తుండటంతో హాజరు నమోదు కోసమే రెండు గంటల పాటు శ్రమించాల్సి వస్తుందని వాపోతున్నారు.

క్లుప్తంగా

మధురై స్టడీ టూర్‌లో ఎంపీ వద్దిరాజు


మీనాక్షి అమ్మవారి దేవాలయంలో ఎంపీ రవిచంద్ర, కుటుంబ సభ్యులు

ఖమ్మంమయూరిసెంటర్: పెట్రోలియం, సహజవాయువు పార్లమెంటరీ స్థాయీ సంఘం తమిళనాడు రాష్ట్రంలో పర్యటిస్తోంది. మూడు రోజుల పాటు సాగే ఈ స్టడీ టూర్‌లో భాగంగా సోమవారం మధురై నగరంలో సంఘం చైర్మన్ రమేష్ విధూరియ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర పాల్గొన్నారు. కాగా, స్టడీ టూర్ భాగంగా మధురై వెళ్లి ఎంపీ వద్దిరాజు తన సతీమణి విజయలక్ష్మి, కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం మధురైలోని మీనాక్షి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

ఏకకాలంలో రైతు రుణ మాఫీ చేయాల్సిందే..


ధర్నాలో పాల్గొన్న రైతు సంఘం నాయకులు, కార్యకర్తలు

వైరా: రైతులు తీసుకున్న రుణాలను ఏకకాలంలో మాఫీ చేయడమే కాక ధరణి పోర్టల్ ద్వారా భూమి సాగులో ఉన్న ప్రతీ రైతుకు పట్టా ఇవ్వాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. ఈమేరకు వైరా తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. రైతులకు ఏకకాలంలో రూ.లక్ష రుణ మాఫీ చేస్తానని ఇచ్చిన సీఎం కేసీఆర్ ఇకనైనా నెరవేర్చాలన్నారు. అనంతరం తహసీల్దార్ జగదీష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు చలపతిరావు, సత్యనారాయణ, శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, కోటేశ్వరరావు, శ్రీనివాసరావు, రేహానా, ఫాతిమా, గట్టమ్మ, తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులకు నిబంధనలపై అవగాహన


వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఉద్యోగులు

ఖమ్మంక్రైం: రాష్ట్ర రవాణా మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఖమ్మం నియోజకవర్గంలోని యువత కోసం ఉచితంగా లెర్నింగ్ లైసెన్స్‌లు ఇప్పిస్తుండగా, ఆయన క్యాంపు కార్యాలయంలో స్లాట్ బుకింగ్‌కు అవకాశం కల్పించారు. ఈమేరకు లైసెన్స్ కోసం వస్తున్న యువతకు రవాణా శాఖ కార్యాలయంలో రోడ్డు భద్రత నిబంధనలపై అవగాహన కల్పిస్తున్నారు. ప్రత్యేకంగా స్క్రీన్లు ఏర్పాటుచేసి నిబంధనలు, వాహనాలు నడిపే సమయాన తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తున్నారు.

రూ.15 లక్షలకు ఐపీ దాఖలు

ఖమ్మం లీగల్: ఖమ్మంకు షేక్ నాగూర్ షరీఫ్ సోమవారం రూ.15 లక్షలకు దివాళా పిటీషన్ (ఐపీ) దాఖలు చేశాడు. హోటల్ వ్యాపారం చేసిన ఆయన పలువురి అప్పులు చేశాడు. ప్రస్తుతం అవి తీర్చే మార్గం లేదంటూ ఇద్దరిని ప్రతివాదులుగా చేరుస్తూ తన న్యాయవాది ద్వారా సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో దివాళా పిటిషన్ దాఖలు చేశాడు.

మద్యం మత్తులో యువకుల వీరంగం

నేలకొండపల్లి: మండల కేంద్రంలోని ఓ వైన్స్ వద్ద ఇరు వర్గాలుగా విడిపోయిన యువకులు గొడవకు దిగడంతో రణరంగంగా మారింది. స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన ఇద్దరేసి యువకులు ఆదివారం రాత్రి వైన్స్ వద్దకు వేర్వేరుగా వచ్చారు. మద్యం తాగుతుండగా ఓ పంచాయితీపై మొదలైన చర్చ గొడవకు దారి తీసింది. దీంతో తోపులాటలు, అరుపులు, కేకలతో నేలకొండపల్లి–కూసుమంచి రహదారిపైకి చేరుకున్నారు. అక్కడ ఉన్న బీరు బాటిళ్లు పగల గొట్టుకుని దాడులకు యత్నించగా స్థానికులు సర్దిచెప్పిపంపించారు. ఈ ఘటనపై ఆదాం సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
మొక్కజొన్న	1,860	1,700
పెసలు	7,601	7,500
కందులు	8,850	5,000
అలసంద	7,100	7,100
మిర్చి	20,300	13,500
ఏసీ మిర్చి	24,600	18,500
మిర్చి తాలు	13,000	8,000
పత్తి	6,700	5,400

– ఖమ్మం వ్యవసాయం

మరో మణిహారం..


సారపాకలోని బీపీఎల్ కర్మాగారం

భద్రాచలం పేపర్ బోర్డ్‌కు భారీ పెట్టుబడి

- రూ. 2,600 కోట్లతో ఎనిమిదో యూనిట్ స్థాపనకు గ్రీన్ సిగ్నల్
- 14న ప్రజాభిప్రాయ సేకరణ
- కాలుష్యంపై దృష్టి సారించాలంటున్న స్థానికులు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: దశాబ్దకాలంగా పారిశ్రామికంగా స్తబ్దుగా ఉన్న జిల్లాకు భారీ పెట్టుబడులు రాబోతున్నాయి. రూ.2600 కోట్ల వ్యయంతో సారపాకలో ఎనిమిదో యూనిట్‌ను నెలకొల్పేందుకు ఇండియన్ టొబాకో కార్పొరేషన్ (ఐటీసీ) లిమిటెడ్ సన్నాహాలు చేస్తోంది. ఇంతకాలం కాగితాలకే పరిమితమైన ఈ ప్రాజెక్టు ఇప్పుడు కార్యరూపం దాల్చే దిశగా కదులుతోంది.

1979లో మొదలు

సింగరేణి బొగ్గు గనులు, గోదావరి జలాలను ఆధారంగా చేసుకుని జిల్లాలో శతాబ్దం క్రితమే పారిశ్రామిక రంగం ప్రారంభమైంది. కేటీపీఎస్, స్పాంజ్ ఐరన్, ఏపీ స్టీల్స్, నవభారత్, హెవీ వాటర్ ప్లాంట్ తదితర పరిశ్రమలు జిల్లాలో కాలుమోపాయి. ఈ క్రమంలోనే 1979లో గోదావరి తీరాన భద్రాచలం పేపర్ బోర్డ్ లిమిటెడ్ కర్మాగారం ఏర్పాటైంది. 10,000 టన్నుల వర్జిన్ పేపర్ ఉత్పత్తి సామర్థ్యంతో మొదలైన ఈ పరిశ్రమ నేడు సాలీనా 7.5 లక్షల టన్నుల వర్జిన్ పేపర్ తయారు చేసే స్థాయికి చేరుకుంది. ప్రస్తుతం ఈ కర్మాగారంలో 1400 మంది పర్మనెంట్, 6,500 మంది కాంట్రాక్ట్ కార్మికులు పని చేస్తున్నారు. ఇప్పటివరకు దశల వారీగా ఏడు యూనిట్ల ద్వారా ఉత్పత్తి జరగగా ఇప్పుడు ఎనిమిదో యూనిట్ నెలకొల్పేందుకు రంగం సిద్ధమైంది.


ఫ్యాక్టరీలో పనిచేస్తున్న కార్మికులు

ప్రజాభిప్రాయ సేకరణ

భూసేకరణ సమస్య లేకపోవడంతో ప్లాంట్ విస్తరణకు ఐటీసీ బోర్డు నుంచి గ్రీన్ సిగ్నల్ లభించింది. ప్లాంట్ నిర్మాణానికి సంబంధించిన డీపీఆర్ సిద్ధమైంది. దీంతో ఈనెల 14న ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టనున్నారు. మరోవైపు ఐటీసీ ప్లాంట్ నుంచి నిర్దేశిత ప్రమాణాలకు మించి వాయు, జల కాలుష్యం వెలువడుతోందనే ఆరోపణలు ఉన్నాయి. ఈ మేరకు ప్లాంట్ చుట్టూ ఉన్న గ్రామాల్లో కొన్ని ప్రజా సంఘాల నాయకులు, ప్రజలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. గత వారం రోజులుగా ఆందోళనలు సైతం కొనసాగుతున్నాయి. దీంతో 14న జరిగే ప్రజాభిప్రాయ సేకరణపై ఉత్కంఠ నెలకొంది.

అంతర్జాతీయ ప్రమాణాలతో..

భద్రాచలం పేపర్ బోర్డు పరిశ్రమ ప్రారంభమైనప్పుడు దీన్ని పూర్తి స్థాయిలో బొగ్గు ఆధారిత పరిశ్రమగా స్థాపించారు. దీంతో వాయు కాలుష్యం తీవ్ర స్థాయిలో ఉండేది. అదే విధంగా పరిశ్రమ నుంచి వెలువడే జల వ్యర్థాలను క్లోరినేషన్ ప్రక్రియ ద్వారా శుద్ధి చేసేవారు. అయినా మలినాలు పూర్తి స్థాయిలో తొలగించడం సాధ్యపడేది కాదు. కానీ కాలక్రమేణా అంతర్జాతీయంగా క్లోరినేషన్ ప్రక్రియకు స్వస్తి పలికారు. ఇదే క్రమంలో ఐటీసీ – భద్రాచలం ప్లాంట్‌లో సైతం దశల వారీగా క్లోరినేషన్‌నకు గుడ్‌బై చెప్పి ఫిన్‌లాండ్‌లో అభివృద్ధి చేసిన ఓజోనేషన్ టెక్నాలజీని ఉపయోగిస్తున్నారు. అలాగే కర్ర నుంచి గుజ్జు (పల్ప్)ను వేరు చేసే ప్రక్రియ, గతంలో స్టోక్ కోల్ ఫైర్డ్ బాయిలర్ విధానంలో జరగగా.. ఇప్పుడు సర్క్యులేటెడ్ ఫ్లూయిడ్ బెడ్ కంబషన్ (సీఎఫ్‌బీసీ) విధానాన్ని ఉపయోగిస్తున్నారు. దీని వల్ల జల, వాయు కాలుష్యం గణనీయంగా అదుపు చేయగలిగారు. భారతీయ ప్రమాణాలకు మించి అంతర్జాతీయ ప్రమాణాలకు దీటుగా వ్యర్థాల నిర్వహణ ఉందనేది కంపెనీ వర్గాల వాదనగా ఉంది.

టాప్‌టెన్‌లో చోటు

భద్రాచలం పేపర్ పరిశ్రమలో ఎనిమిదో యూనిట్ స్థాపించేందుకు దశాబ్దం కిందటే ప్రణాళిక రూపొందించారు. అయితే దీనికి అవసరమైన స్థల సేకరణ కష్టంగా మారింది. ప్లాంట్ల స్థాపన సమయంలోనే ప్రభుత్వం 507 ఎకరాలు అందజేసింది. ఇక మరోసారి అదనంగా భూసేకరణ కష్టమని తేల్చిచెప్పింది. దీంతో ప్లాంటు పనులు ముందుకు సాగలేదు. చివరకు ప్రస్తుత ప్లాంట్ ఆవరణలోని సిబ్బంది క్వార్టర్లను తొలగించి, అక్కడ ఎనిమిదో యూనిట్ నిర్మించాలని నిర్ణయించారు. ఈ ప్లాంట్‌కు ప్రాథమికంగా రూ.2,600 కోట్ల పెట్టుబడి పెట్టనున్నారు. ఆ తర్వాత దశల వారీగా ఈ మొత్తం రూ.4,000 కోట్ల వరకు చేరనుంది. కొత్తగా నిర్మించబోయే ప్లాంట్ వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 2.5 లక్షల టన్నులుగా నిర్దేశించారు. దీంతో ఐటీసీ భద్రాచలం కర్మాగారం వార్షిక ఉత్పత్తి సామర్థ్యం సాలీనా పది లక్షల టన్నులకు చేరుకోనుంది. ఇప్పటికే వర్జిన్ పేపర్ తయారీలో ఆసియాలోనే నంబర్ వన్ సంస్థగా ఉన్న ఈ ప్లాంట్ తాజా విస్తరణతో ప్రపంచ వ్యాప్తంగా టాప్‌టెన్ జాబితాలో చోటు దక్కించుకునే అవకాశం ఉంది.

అన్నం పెట్టిన చేతులతోనే హత్య

- ఇద్దరు చిన్నారులపై కన్నతండ్రి కర్కశత్వం
- మద్యం మత్తులో కిరాతకుడిగా మారిన వైనం
- పిల్లలిద్దరిని హత్య చేసి పరారైన నిందితుడు
- మధిర మండలం రాయపట్నంలో విషాదం


గ్రామంలో విచారణ నిర్వహిస్తున్న పోలీసు అధికారులు


ఆస్పత్రిలో కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న చిన్నారుల తల్లి, కుటుంబ సభ్యులు

మధిర: ఆ చేతులతోనే చిన్నారులకు గోరుముద్దలు తినిపించి ఉంటాడు. వారితో సరదా ముచ్చట్లు చెప్పి ఉంటాడు. కానీ ఇప్పుడే వారి గొంతులు నులిమి హత్య చేశాడు. సొంత గ్రామానికే చెందిన యువతిని ప్రేమించి పెళ్లి చేసుకున్న ఆ వ్యక్తి ఇద్దరు పిల్లలు జన్మించాక కొన్నాళ్లు బాగానే ఉండగా.. ఎందుకో కాని తన ప్రవర్తనలో మార్పు వచ్చింది. భార్యతో తరచుగా గొడవ పడుతుండడంతో భరించలేక ఆమె ఇంటి నుంచి వెళ్లిపోయి గ్రామంలోనే మరో చోట నివసిస్తోంది. ఆపై మద్యానికి బానిస కావడంతో పాటు చోరీలకు అలవాటు పడ్డాడు. ఇదంతా సరిపోనట్లు కసాయిగా మారి అభం శుభం తెలియని కన్నబిడ్డలను గొంతు నులిమి హత్య చేశాడు. ఆపై ఏమీ తెలియనట్లుగా పిల్లలిద్దరినీ మూటగట్టి ఇంట్లో పెట్టి పారిపోయాడు. అయితే, పిలల్లిద్దరు పాఠశాల నుంచి వస్తారని ఎదురుచూస్తున్న వారి తల్లికి ఈ విషయం తెలిసి గుండెలు బాదుకుంటూ రోదిస్తున్న తీరు అందరినీ కంట తడి పెట్టించింది. మధిర మండలం రాయపట్నంలో సోమవారం జరిగిన ఈ విషాద ఘటన వివరాలిలా ఉన్నాయి.

వరుస చోరీలతో పోలీసు విచారణ

రాయపట్నంకు చెందిన పార్శపు శివరామ గోపాలరావు పదేళ్ల క్రితం అదే గ్రామానికి చెందిన ఏసుమణి (చిన్నమ్మాయి)ని ప్రేమ వివాహం చేసుకోగా వీరికి మూడో తరగతి చదివే రామకృష్ణ(8), ఒకటో తరగతి చదువుతున్న కుమార్తె ఆరాధ్య(6) ఉన్నారు. స్థానిక ప్రాథమికోన్నత పాఠశాలలో చదువుతుండగా, నెల క్రితం భార్య ఏసుమణితో గోపాలరావు గొడవ పడగా పిల్లలతో సహా అదే గ్రామంలోని పుట్టింటికి వెళ్లి పిల్లలను చదివిస్తోంది. ఆతర్వాత గోపాలరావు గత నెలలో లారీ డ్రైవర్ విజయ్‌కుమార్‌తో కలిసి క్లీనర్‌గా వెళ్లాడు. ఒడిశాలోని కటక్‌లో లోడ్ దిగుమతి చేశాక గత నెల 24న లారీలో ఉన్న రూ.35వేలు తీసుకుని 25న రాయపట్నం వచ్చాడు. ఈ విషయాన్ని విజయ్‌కుమార్ తన భార్య సమతకి ఫోన్ చేసి చెప్పడంతో ఆమె మధిర టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ ఘటనపై విచారణ జరుగుతుండగానే ఎర్రపాలెం మండలం ఇనగాలిలో ఒక మోటార్ సైకిల్, సెల్‌ఫోన్, మధిర మండలం మహాదేవపురంలో ఫోన్ చోరీ చేశాడు. దీంతో పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకొని విచారించారు.

మద్యం మత్తులో బిడ్డల గొంతు నులిమి..

శివరామ గోపాలరావు సోమవారం సాయంత్రం 4 గంటల సమయంలో పాఠశాలకు వెళ్లి పిల్ల లు రామకృష్ణ, ఆరాధ్యను తన సొంత ఇంటికి తీసుకు వచ్చాడు. అప్పటికే మద్యం మత్తులో ఉన్న ఆయన పిల్లల గొంతునులిమి హత్య చేసి దుప్పట్లో మూటకట్టి పరారయ్యాడు. స్కూల్ నుంచి పిల్లలు ఎంతసేపటికి రాకపోవడంతో 5 గంటలకు ఏసుమణి వెతుకుతుండగా గోపాలరావు తీసుకెళ్లాడని స్థానికులు చెప్పారు. దీంతో అనుమానం వచ్చి ఆయన సొంత ఇంటికి వెళ్లి చూసినా పిల్లల ఆచూకీ లభించలేదు. ఆ తర్వాత బీరువాను పక్కకు జరపగా దుప్పటిలో కట్టిన పిల్లల మృతదేహాలు బయటపడ్డాయి. స్కూల్ నుంచి వస్తారని చూస్తున్న పిల్లలు అలా కనిపించడంతో ఆమె కన్నీరుమున్నీరుగా రోదిస్తుండడంతో స్థానికులు చేరుకుని ఊపిరి ఉందనే ఆశతో పిల్లలను మధిర ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. కానీ అప్పటికే పిల్లలు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ విషయాన్ని తెలుసుకున్న వైరా ఏసీపీ రెహమాన్, ట్రెయినీ ఐపీఎస్ అవినాష్‌కుమార్, సీఐ వసంత్ కుమార్ గ్రామానికి చేరుకుని విచారణ చేపట్టారు. అలాగే, అప్పటికే పరారీలో ఉన్న నిందితుడి కోసం గాలిస్తున్నారు. అలాగే, మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మధిర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా... అభం శుభం తెలియని చిన్నారులను కన్న తండ్రే హత్య చేయడంతో వారి తల్లి, బంధువులు రోదిస్తున్న తీరు గ్రామస్తులను కంట తడి పెట్టాంచింది.

'సింగరేణి ఎన్నికలకు భయపడుతున్న ప్రభుత్వం'


సమావేశంలో మాట్లాడుతున్న సీతారామయ్య

సత్తుపల్లిరూరల్: సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం భయపడుతోందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య విమర్శించారు. సత్తుపల్లిలోని జేవీఆర్ ఓసీల్లో సోమవారం పర్యటించిన ఆయన కార్మికులతో మాట్లాడారు. కార్మికుల న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం తమ యూనియన్ పోరాడుతోందని తెలిపారు. కార్మికులకు వేజ్‌బోర్డు సాధనలో కీలకంగా వ్యవహరించామని చెప్పారు. కాగా, సింగరేణిలో లాభాల వాటా, బోనస్‌ను యాజమాన్యం ఒకేసారి చెల్లించాలని, సింగరేణి కార్మికులు సీఎం ఇచ్చిన మాటీ మేరకు ఇళ్ల నిర్మాణానికి కృషి చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో యూనియన్, సీపీఐ నాయకులు దండు ఆదినారాయణ, డి.శేషయ్య, వీరస్వామి, గట్టయ్య, ఎస్.సుధాకర్, జి.నర్సింహారావు, కాగితం వెంకటేశ్వర్లు, ఎస్.ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

భోజనంలో విష ప్రయోగం?

కారేపల్లి: తినే అన్నంలో విషప్రయోగం జరిగినట్లు తెలుస్తుండగా, ఓ మహిళ అస్వస్థతకు గురి కావడంతో ఆస్పత్రిలో చేర్పించారు. వివరాలు... కారేపల్లి పోస్టాఫీస్ రోడ్డులో నివాసం ఉంటున్న తురక లక్ష్మి స్థానికంగా చేపల వ్యాపారం చేస్తోంది. సోమవారం ఉదయం ఆమె పాత్రలోని అన్నాన్ని ప్లేట్‌లో వేసుకొని తింటుండగా పురుగుల మందు వాసన వచ్చింది. అప్పటికే కాస్త తిన్న ఆమె అస్వస్థతకు గురికాగా కుటుంబీకులు కారేపల్లి పీహెచ్‌సీలో ప్రాథమిక చికిత్స చేయించాక ఖమ్మం తరలించారు. ఇదిలా ఉండగా లక్ష్మితో కలిసి కుమారుడు, కోడలు, వారి పిల్లలు నివసిస్తున్నారు. అయితే, అన్నం గిన్నెలో మందు కలిపారా, ఇతర కారణాలతో ఆమె అస్వస్థతకు గురైందో తెలియాల్సి ఉంది.

విద్యుదాఘాతంతో మహిళ మృతి


సంగీత (ఫైల్)

కామేపల్లి(కారేపల్లి): ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్‌తో ఓ మహిళ మృతి చెందిన ఘటన కామేపల్లి మండలం బర్లగూడెంలో సోమవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన మూడ్ సంగీత(28) ఇంట్లో పనులు చేస్తున్న క్రమంలో రేకులకు చేయి తగిలింది. అప్పటికే రేకులకు కరెంట్ ప్రసరణ కావటంతో సంగీత షాక్‌కు గురై మృతి చెందింది. ఆమెకు భర్త మూడ్ చిన్న, ఒక కుమార్తె ఉంది.

చెరువులో దూకి వ్యక్తి ఆత్మహత్య

ఖమ్మం అర్బన్: ఖమ్మం పుట్టకోటకు చెందిన బోడా వెంగళరావు(50) జీవితంపై విరక్తితో గ్రామ సమీపంలోని చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కొన్నేళ్ల క్రితం ఆయనను భార్య వదిలేయగా మనస్తాపం చెందుతున్నాడు. ఈ నేపథ్యాన ఆదివారం సాయంత్రం ఆత్మహత్య చేసుకోగా సోమవారం ఉదయం చెరువులో మృతదేహాన్ని గుర్తించారు. అనంతరం అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు సహకారంతో మృతదేహాన్ని మార్చురీకి తరలించి కేసు నమోదు చేసినట్లు ఖమ్మం అర్బన్ పోలీసులు తెలిపారు.

మోటార్లు, కాపర్ వైర్ చోరీకి యత్నం

ఓ వ్యక్తిని పోలీసులకు అప్పగించిన రైతులు

చింతకాని: రైతుల పంట పొలాల్లో ఉన్న విద్యుత్ మోటార్లతో పాటు ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్ వైర్‌ను చోరీ చేస్తున్న ఇద్దరిని మండలంలోని కొదుమూరు, రాఘవాపురం రైతులు సోమవారం బంధించారు. రాఘవాపురం గ్రామానికి చెందిన దొబ్బల వెంకటేశ్వరరావు భూమిలో గుర్తుతెలియని వ్యక్తులు ఉన్నట్లు గుర్తించిన రైతులు పలువురు వెళ్లగా అక్కడ ఉన్న ఇద్దరు విద్యుత్ మోటార్‌ను ధ్వంసం చేసి కాపర్ వైర్ కాలుస్తున్నారు. అలాగే, వారికి సమీపాన ఆటోలో కాపర్ వైరు, రైల్వే అల్యూమినియం వైర్, కట్టర్లు ఉన్నట్లు గుర్తించారు. దీంతో ఇద్దరిని బంధించేందుకు యత్నించడంతో ఒకరు పారిపోగా ఇంకో వ్యక్తి పట్టుబడ్డాడు. దీంతో రైతులు ఇచ్చిన సమాచారంతో సదరు వ్యక్తి, ఆటోను పోలీసులు తీసుకెళ్లారు. కాగా, పట్టుబడిన ఆటోకు నంబర్ లేకపోగా, పోలీసుల విచారణలో నిందితుడు కొన్ని విద్యుత్ మోటార్లను దొంగిలించినట్లు ఒప్పుకున్నాడని సమాచారం.

వివాదాస్పద స్థలంలో గుడిసెలు


ఆక్రమణదారులతో మాట్లాడుతున్న అధికారులు

అశ్వారావుపేటరూరల్: ఓ వివాదాస్పద స్థలంలో సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం నిరుపేదలు అక్రమంగా గుడిసెలు నిర్మించారు. ఈక్రమంలో స్థలాల కేటాయింపులో వారి మధ్య వాగ్వాదం జరిగింది. అశ్వారావుపేటలోని పామాయిల్ ఫ్యాక్టరీ ఎదురుగా ఇరువర్గాల మధ్య కోర్టు వివాదంలో ఉన్న ఐదెకరాల ఖాళీ స్థలంలో సోమవారం తెల్లవారుజామున పేదలు గుడిసెలు వేశారు. పార్టీ నాయకులు ఒక్కొక్కరికిగా రెండు సెంట్లు(96గజాలు) చొప్పున దాదాపు 210 మందికి కేటాయించారు. మరో వంద మందికి స్థలం సరిపోకపోవడంతో వాగ్వాదానికి దిగారు. అనంతరం కెమిలాయిడ్స్ గెస్ట్ హౌస్ సమీపంలోని రెండెకరాల ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించేందుకు తరలివచ్చారు. శుభ్రం చేస్తుండగా ఆర్ఐ అనిల్ అక్కడి చేరుకుని స్థలాన్ని ఖాళీ చేయాలని హెచ్చరించడంతో వెళ్లిపోయారు.

స్థలంలో ఫ్లెక్సీ ఏర్పాటు..తొలగింపు..

న్యాయస్థానం పరిధిలో ఉన్న వివాదాస్ప స్థలంలో సోమవారం తహసీల్దార్ లూథర్ విల్సన్, సీఐ బాలకృష్ణ, ఎస్సై బి.రాజేశ్ కుమార్ ఆధ్వర్యంలో బోర్డు ఏర్పాటు చేశారు. ఈ స్థలం న్యాయస్థానం పరిధిలో ఉందని, ఈ స్థలాన్ని ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పదని పేదలకు కౌన్సెలింగ్ చేశారు. కాగా అధికారులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని కొద్ది సేపటికే పేదలు చింపేశారు. దీంతో అధికారులు అక్కడి నుంచి వచ్చేశారు.

తాగునీటి ఎద్దడి ఎదురుకావొద్దు..



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్, (ఇన్‌సెట్) కలెక్టర్‌కు వేప విత్తనాలు అందజేస్తున్న వనజీవి రామయ్య

- వర్షాభావ పరిస్థితుల్లో ఇబ్బంది లేకుండా చూడండి
- అధికారులతో సమీక్షలో కలెక్టర్ గౌతమ్

ఖమ్మం సహకారనగర్: ఎక్కడ కూడా తాగునీటి ఎద్దడి ఎదురుకాకుండా అన్ని చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం ఆయన వివిధ శాఖల అధికారులతో సమావేశమై మాట్లాడారు. రుతుపవనాల ఆలస్యం, వర్షాలు సాధారణం కంటే తక్కువగా కురిసిన నేపథ్యాన జిల్లాలో తాగు, సాగునీటికి ఇబ్బంది ఏర్పడకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలన్నారు. జిల్లాలో ఉన్న రిజర్వాయర్లలో నిల్వ ఉన్న నీటిని తాగునీటికి అవసరాలకు మొదటి ప్రాధాన్యతగా కేటాయించాలని తెలిపారు. ఇన్ టేక్ వెల్‌ల్లో పూడిక తీసి, నీటి సామర్థ్యం పెరిగేలా చూడాలని చెప్పారు. అలాగే, పంటల సాగుపై సమీక్షించిన కలెక్టర్ పలు సూచనలు చేశారు.

ఈవీఎం భవన నిర్మాణం పరిశీలన

కలెక్టరేట్ ఆవరణలో నిర్మిస్తున్న ఈవీఎం గోదాం పనులను కలెక్టర్ గౌతమ్ తనిఖీ చేశారు. వర్షాలు ఉధృతం కాకముందే పనులు పూర్తిచేయాలని ఆర్ అండ్‌బీ అధికారులు, కాంట్రాక్టర్‌కు సూచించారు. అలాగే, సోలార్ ప్యానళ్లతో కూడిన పార్కింగ్ షెడ్ పనులను కూడా కలెక్టర్ పరిశీలించారు. ఈకార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ ఎన్.మధుసూదన్, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, అసిస్టెంట్ కలెక్టర్ రాధికాగుప్తా, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సదాశివ, ఇరిగేషన్ ఎస్ఈ ఆనంద్‌కుమార్, సీపీఓ శ్రీనివాస్, డీఏఓ విజయనిర్మల, జిల్లా ఉద్యానవన అధికారి అనసూయ, డీఆర్డీఓ విద్యాచందన, ఆర్ అండ్ బీ ఈఈ శ్యాంప్రసాద్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ రాంబాబు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన 'వనజీవి'

వనజీవి, పద్మశ్రీ రామయ్య కలెక్టర్ గౌతమ్‌ను కలిశారు. ఈసందర్భంగా కలెక్టర్‌కు సుమారు 20 కిలోల వేప విత్తనాలను అందజేసి నాటేందుకు చొరవ తీసుకోవాలని కోరారు. ఆతర్వాత తన పింఛన్ పెంపుతోపాటు ద్విచక్ర వాహనాన్ని ఇప్పించాలని ఆయన కలెక్టర్‌ను కోరారు. అదనపు కలెక్టర్ స్నేహలత, అసిస్టెంట్ కలెక్టర్ రాధికాగుప్తా, డీఆర్డీఓ విద్యాచందన పాల్గొన్నారు.

ముస్లింలంతా మంత్రి పువ్వాడ వెంటే..

కేఎంసీ మేయర్ నీరజ


మాట్లాడుతున్న మేయర్ నీరజ, పక్కన నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మంలో మునుపెన్నడూ లేని విధంగా అభివృద్ధి జరుగుతుండడంతో ముస్లింలు సహా అన్ని వర్గాల ప్రజలు మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌తోనే ఉంటారని నగర మేయర్ పునుకొల్లు నీరజ, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఖమర్, కార్పొరేటర్ షేక్ మక్బూల్ పేర్కొన్నారు. ఖమ్మంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఇటీవల కొందరు రెచ్చగొట్టే విధంగా రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి తన వెంట తిరిగిన వారు, కాంగ్రెస్ కార్యకర్తలకే కండువాలు కప్పి పార్టీలో చేరారని చెప్పుకోవడం సరికాదన్నారు. ఏదిఏమైనా ఖమ్మం ప్రజలను ఓటు అడిగే హక్కు బీఆర్ఎస్‌కు మాత్రమే ఉందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, మాజీ కార్పొరేటర్ షౌకత్ అలీ, సుడా డైరెక్టర్ ముక్తార్, పార్టీ మైనార్టీ విభాగం అధ్యక్షుడు తాజుద్దీన్‌తో పాటు మజీద్, ముజాహిద్, మెహబూబ్ అలీ, షేక్ షకీనా, షంషుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీజ్ఞాన సరస్వతి ఆలయంలో సోలార్ విద్యుత్ ప్లాంట్

ప్రారంభించిన ఎమ్మెల్యే వెంకటవీరయ్య


ఎమ్మెల్యే వెంకటవీరయ్యను సన్మానించిన ఆలయ కమిటీ బాధ్యులు

సత్తుపల్లి: పట్టణంలోని శ్రీలలిత శ్రీగాయత్రి సహిత జ్ఞాన సరస్వతి ఆలయంలో సోలార్ విద్యుత్ ప్లాంట్‌ను ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య సోమవారం ప్రారంభించారు. ఈమేరకు కొండా అనిల్ కృష్ణశర్మ, దీప్తిశ్రీ దంపతులు, వల్లిశ్రీ తోలేటి, రాజశేఖర్ తోలేటి, విశ్వ విపాక తదితరులు కొడిమెల నిర్మలాదేవి జ్ఞాపకార్థం రూ.3.35లక్షల వ్యయంతో ఈ ప్లాంట్ ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయ నిర్వహణకు దాతలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. అనంతరం ఎమ్మెల్యేను ఆలయ కమిటీ నిర్వాహకులు సన్మానించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కొత్తూరు ఉమామహేశ్వరరావు, డీసీసీబీ డైరెక్టర్ చల్లగుండ్ల కృష్ణయ్య, ఆలయ కమిటీ అధ్యక్షులు కొడిమెల అప్పారావుతో పాటు పుల్లారావు, జగన్మోహన్‌రావు, శర్మ, అలవాల శ్రీనివాసరావు, ఊటుకూరి వినోద్, మల్లికార్జున్, మాదిరాజు కృష్ణారావు, కొండపల్లి విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

‘అదృశ్యం’ అవాస్తవం!

పవన్ కళ్యాణ్ ఆరోపణలు నిరాధారం: పోలీసు శాఖ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో వేల మంది మహిళలు అదృశ్యమవుతున్నారని, అందుకు వలంటీర్లే కారణమంటూ జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ చేసిన ఆరోపణలు పూర్తిగా అవాస్తవం, నిరాధారమని పోలీసు శాఖ స్పష్టం చేసింది. జాతీయ నేర గణాంకాల సంస్థ (ఎన్‌సీఆర్‌బీ) నివేదికను వక్రీకరించి ప్రజల్ని తప్పుదారి పట్టించేందుకే ప్రయత్నించారని ఓ ప్రకటనలో పేర్కొంది. దిశ వ్యవస్థ, జీరో ఎఫ్ఐఆర్ లాంటి సంస్కరణలతో దేశంలోనే మహిళా భద్రతలో ఆంధ్ర ప్రదేశ్ అగ్రగామిగా నిలిచిందని గుర్తు చేసింది. 2019–21 మధ్య రాష్ట్రంలో 30 వేల మంది మహిళల అదృశ్యం కేసులు నమోదు కాగా 14 వేల మంది ఆచూకీ మాత్రమే కనుగొన్నట్లు పవన్ కల్యాణ్ చేసిన ఆరోపణల్లో నిజం లేదని పేర్కొంది. ప్రేమ వ్యవహారాలు, పరీక్షల్లో ఫెయిల్ కావడం, ఇంట్లో ఘర్షణలు, మానసిక రుగ్మతలు తదితర కారణాలతో ఆచూకీ తెలియని కేసులన్నింటినీ పోలీసులు మిస్సింగ్ కేసులుగానే నమోదు చేస్తారు.

ఆచూకీ గుర్తించి సురక్షితంగా..

2019 – 21 మధ్య అదృశ్యమైన మహిళలు మొత్తం 24,557 మంది. 2019కు ముందు అదృశ్యమై ఆచూకీ లభించని మహిళలు 1,542 మంది. మొత్తంమీద 2021 నాటికి అదృశ్యమైన మహిళల సంఖ్య 26,099. వీరిలో 2021 డిసెంబర్ నాటికి 23,394 మంది ఆచూకీ కనుగొని కుటుంబ సభ్యుల వద్దకు చేర్చారు. మిగిలిన 2,705 మందిలో 500 మంది ఆచూకీని 2022–23లో కనుగొని కుటుంబ సభ్యుల వద్దకు చేర్చారు. హ్యూమన్ ట్రాఫికింగ్ (మానవ అక్రమ రవాణా)కు పాల్పడినట్లు రాష్ట్రంలో ఇప్పటివరకు ఒక్క వలంటీర్ పైనా ఎవరూ ఫిర్యాదు చేయలేదు. వారిపై ఒక్క కేసు కూడా నమోదు కాలేదు. స్వచ్ఛంద సేవలో నిమగ్నమైన లక్షలాది మంది వలంటీర్లను కించపరుస్తూ వ్యక్తిగత ప్రతిష్టకు భంగం కలిగించేలా ఆరోపణలు చేయడం గర్హనీయం.

మరిన్ని వార్తలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

వలంటీర్ల ఆగ్రహ జ్వాల

పవన్ ‘సంఘ విద్రోహ’ వ్యాఖ్యలపై రాష్ట్రవ్యాప్తంగా నిరసన

ర్యాలీలు.. పలుచోట్ల దిష్టి బొమ్మలు, ఫొటోలకు నిప్పు



ప్రకాశం జిల్లా.. ఒంగోలు చర్చి సెంటర్‌లో కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న వలంటీర్లు

సాక్షి, అమరావతి, నెట్‌వర్క్: గ్రామాల్లో ఆత్మీయులకు స్వచ్ఛందంగా సేవలందించే వలంటీర్లను జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ సంఘ విద్రోహ శక్తులతో పోల్చటంపై నిరసన జ్వాలలు భగ్గుమన్నాయి. అవ్వాతాతలు, అక్కచెల్లెమ్మలు ఆప్యాయంగా పలుకరించే వలంటీర్ సోదరులకు దురుద్దేశాలను ఆపాదించడంపై రాష్ట్రవ్యాప్తంగా ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. వలంటీర్లుగా దాదాపు 53 శాతం మంది యువతులు సేవలందిస్తుండగా సాటి మహిళలకు వారెందుకు చేటు చేస్తారని ప్రశ్నిస్తున్నారు. కోవిడ్ మహమ్మారి విరుచుకుపడ్డ వేళ బాధితుల వద్దకు వెళ్లేందుకు కుటుంబ సభ్యులే వెనుకాడినా వలంటీర్లు మానవత్వంతో అందించిన సేవలను గుర్తు చేస్తున్నారు. పవన్ తన వ్యాఖ్యలను బేషరతుగా ఉపసంహరించుకుని వలంటీర్లకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు. పలుచోట్ల వలంటీర్లు ఆగ్రహంతో ఊగిపోతూ పవన్‌కళ్యాణ్ ఫోటోలు, పోస్టర్లను చెప్పుతో కొడుతూ నిరసన తెలిపారు. దిష్టి బొమ్మలు దగ్ధం చేశారు. జనసేన అధ్యక్షుడి అనుచిత వ్యాఖ్యలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ వలంటీర్లు నల్ల రిబ్బన్లు ధరించి విధులకు హాజరయ్యారు. ‘సేవా భావంతో పనిచేసే మా వలంటీర్ల జోలికొస్తే తాట తీస్తాం..’ అంటూ హెచ్చరించారు. నిన్న.. వలంటీర్లను మహిళల కిడ్నాప్‌లకు సహకరించే సంఘ విద్రోహులుగా అభివర్ణించిన పవన్‌కళ్యాణ్ తాజాగా వారు సేకరించే సమాచారం ఎక్కడెక్కడికో పోతోంది...! అది చాలా భయంకరమైన వ్యవస్థ.. ఇళ్లల్లోకి దూరుతున్నారు.. ! అవి ఊడిగం ఉద్యోగాలంటూ వలంటీర్ల ఆత్మాభిమానాన్ని కించపరిచేలా మరోసారి అనుచిత వ్యాఖ్యలు చేయడం గమనార్హం. ఏపీలో మహిళల కిడ్నాప్‌లకు సంబంధించి తనకు కేంద్ర నిఘా వర్గాల నుంచి సమాచారం ఉందని పవన్ చెబుతుండగా.. అదే నిజమైతే అలాంటి కీలక వివరాలను ఓ రాజకీయ నేతకు నిఘా వర్గాలు అందిస్తాయా? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఈ మొత్తం వ్యవహారానికి స్క్రిప్ట్ సమకూర్చింది ఈనాడు రామోజీ కాగా చంద్రబాబు డైరెక్షన్‌లో పవన్ యాక్టింగ్ చేస్తున్నట్లు స్పష్టమవుతోంది.

పది రోజుల్లో ఆధారాలివ్వాలి

- పవన్‌కు రాష్ట్ర మహిళా కమిషన్ నోటీసు
- లేదంటే మహిళలకు బహిరంగ క్షమాపణ చెప్పాల్సిందే



మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మకు ఫిర్యాదు చేస్తున్న వాలంటీర్లు, మహిళా సంఘాల నేతలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో వేల మంది మహిళలు అదృశ్యమయ్యారని, అందుకు వలంటీర్లే కారణమంటూ భయభ్రాంతులకు గురి చేసేలా జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ వ్యాఖ్యలు చేయడంపై రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ ఆందోళన వ్యక్తం చేశారు. తమను సంఘ విద్రోహ శక్తులుగా చిత్రీకరిస్తూ పవన్‌కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ పలువురు వలంటీర్లు, మహిళా సంఘాల నేతలు మహిళా కమిషన్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. ఈమేరకు మంగళగిరిలోని మహిళా కమిషన్ ప్రధాన కార్యాలయంలో చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మను కలిశారు. నిరాధార ఆరోపణలు చేసిన పవన్‌పై తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం వాసిరెడ్డి పద్మ మీడియాతో మాట్లాడుతూ ఎలాంటి ఆధారాలు లేకుండా వలంటీర్లపై దారుణమైన కామెంట్లు చేసిన పవన్‌కు నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. దీనిపై ఆధారాలతో పది రోజుల్లోగా మహిళా కమిషన్‌కు వివరణ ఇవ్వాలని లేదంటే మహిళలకు పవన్ బహిరంగ క్షమాపణ చెప్పాలని స్పష్టం చేశారు. ఒంటరి మహిళలను అవమానించేలా మాట్లాడిన పవన్ తన వద్ద ఉన్న కేంద్ర ఇంటెలిజెన్స్ సమాచారాన్ని బయట పెట్టాలని సూచించారు.

అక్టోబర్‌లో నంది నాటకోత్సవాలు

సాక్షి, అమరావతి: నంది నాటకోత్సవాలను అక్టోబర్ నెలలో ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని సమాచార, పౌర సంబంధాల శాఖ కమిషనర్, ఎక్స్ అఫిషియో సెక్రటరీ, ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ తుమ్మా విజయ్ కుమార్‌రెడ్డి వెల్లడించారు. ఈ ఏడాది నంది నాటకోత్సవాల్లో (రంగస్థల పురస్కారాలు) భాగంగా ఐదు విభాగాల్లో 73 అవార్డులను ప్రదానం చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. సోమవారం విజయవాడ ఆర్టీసీ కాన్ఫరెన్స్ హాల్‌లో నంది నాటకోత్సవాల నిర్వహణపై నాటక రంగ ప్రముఖులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. పద్య, సాంఘిక నాటకాలు, సాంఘిక నాటికలు, పిల్లల లఘు నాటిక, కళాశాల లేదా యూనివర్సిటీ లఘు నాటిక (ప్లేలెట్స్) అనే ఐదు విభాగాల్లో అవార్డులు అందజేయాలని నిర్ణయించామన్నారు. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్‌ను ఈ నెల 5న రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. ఆగస్టు 5వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణకు సమయం ఇచ్చామని తెలిపారు. అందరికీ అనుకూలంగా ఉండే ప్రాంతాన్ని నంది నాటకోత్సవాలకు వేదికగా ఎంపిక చేస్తామని తెలిపారు.

శ్రీవారి దర్శనానికి 36 గంటలు

తిరుమల: తిరుమలలో ఆదివారం అర్ధరాత్రి వరకు 88,836 మంది స్వామివారిని దర్శించుకున్నారు. కానుకల రూపంలో హుండీలో రూ.4.69 కోట్లు సమర్పించారు. దర్శన టికెట్లు లేని భక్తులకు 36 గంటల్లో దర్శనం లభిస్తోంది. కాగా, తిరుమలలో చిరుజల్లులు కురిశాయి. శ్రీవారి దర్శనం అనంతరం బయటకు వచ్చిన భక్తులు పరుగులు తీశారు.

మినిస్టర్ క్వార్టర్స్ నీటి బకాయిలు రూ 4.34 కోట్లు!



బంజారాహిల్స్‌లోని మినిస్టర్ క్వార్టర్స్

బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లోని మంత్రుల నివాస సముదాయాల మంచినీటి బిల్లులు రోజురోజుకు పెరిగిపోతుండటంతో జలమండలి అధికారులు పెండింగ్ బిల్లులు రాబట్టుకోలేక సతమతమవుతున్నారు. మినిస్టర్ క్వార్టర్స్ వాటర్ కనెక్షన్లు కట్ చేయడానికి కూడా వెనుకాడబోమని ఈ ఏడాది మార్చిలో హెచ్చరికలు జారీ చేసినా సంబంధిత ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించడం లేదు. బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని మినిస్టర్ క్వార్టర్స్‌లో 32 క్వార్టర్స్ ఉన్నాయి. 2009 నుంచి ఈ క్వార్టర్స్‌కు సంబంధించిన మంచినీటి బిల్లులు చెల్లించకపోవడంతో యేటికాయేడు అవి చాంతాడాంత పెరిగిపోతున్నాయి. ఇప్పటికీ బిల్లుల బకాయిలు రూ.4.34 కోట్లకు చేరుకున్నాయి. ఉమ్మడి ఏపీ నుంచే ఈ బిల్లులు బకాయి ఉన్నాయని జలమండలి అధికారులు పేర్కొంటున్నారు. ఈ ఏడాది మార్చి 15వ తేదీన ఆర్‌అండ్‌బీ ఈఈ ఆర్‌అండ్‌బీ ఎస్ఈకి వాటర్ బిల్లులు విడుదల చేయాల్సిందిగా లేఖ కూడా రాశారు. ఇప్పటిదాకా దానికి స్పందన కరువైంది. బకాయిలు చెల్లించాలని జలమండలి అధికారులు ఎన్నో సార్లు ఆర్అండ్ బి అధికారులకు లేఖలు రాయడమే కాకుండా మొరపెట్టుకుంటున్నారు. భారీగా బకాయిలు పేరుకుపోయాయని బోర్డుకు నష్టంవాటిల్లుతుందని ఆందోళన కూడా వ్యక్తం చేశారు. కొంతనైనా చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. వాటర్ కనెక్షన్లు కట్‌చేయకముందే చెల్లించండి అంటూ వేడుకున్నారు. అయినాసరే ఆర్‌అండ్‌బి అధికారులు కనికరించడం లేదు. సామాన్యులు ఒక నెల బిల్లు చెల్లించకపోతే వాటర్ కనెక్షన్ కట్‌చేసే జలమండలి అధికారులు మంత్రులు బిల్లులు చెల్లించకపోతే మాత్రం పుష్కర కాలంగా నోరెత్తడం లేదు. ఈ విషయంలో ఆర్‌అండ్‌బి అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నది. సామాన్యులకు ఒక న్యాయం, అమాత్యులకు మరో న్యాయమా అంటూ పలువురు విమర్శిస్తున్నారు.

ఇంకా చెల్లించని కరెంటు బకాయిలు

మినిస్టర్ క్వార్టర్స్‌లో కరెంటు బకాయిలు ఏ నెలకానెల పెరిగిపోతున్నాయి. 2022 ఆగస్టు నుంచి మినిస్టర్ క్వార్టర్స్ కరెంటు బిల్లులు చెల్లించకపోవడంతో ఇప్పటికే ’ 70 లక్షల బకాయిలు పేరుకుపోయాయి. ఈ బిల్లులు చెల్లించాలంటూ విద్యుత్ శాఖ అధికారులు సంబంధిత ఆర్‌అండ్‌బి అధికారులను వేడుకుంటున్నా స్పందన కరువవుతున్నది. భారీగా కరెంటు బిల్లులు పేరుకుపోతుండటంతో సంబంధిత ఏఈలకు విద్యుత్ ఉన్నతాధికారులు మెమోలు జారీచేస్తున్నారు ఇంక్రిమెంట్లు కట్ చేస్తున్నారు. ప్రతిరోజూ పెండింగ్ బిల్లుల వసూళ్లు ఎంత వరకు వచ్చాయంటూ తీవ్ర ఒత్తిడి తీసుకొస్తున్నారు. అమాత్యులు మాత్రం స్పందించకపోగా ఈ బిల్లులు చెల్లించాల్సిన ఆర్‌అండ్‌బి ఇంజనీర్లు నోరెత్తడం లేదు.

రూ.5 వేలకు ఊడిగం చేసే ఉద్యోగం ‘వలంటీరు’

- సున్నితమైన సమాచారాన్ని వలంటీర్లు సేకరిస్తున్నారు
- వితంతువులు, ఒంటరి మహిళలు జాగ్రత్తగా ఉండాలి
- ఏలూరు జనసేన వీర మహిళల సమావేశంలో పవన్‌కళ్యాణ్



సాక్షి ప్రతినిధి, ఏలూరు : ‘వలంటీరు పోస్టు అనేది రూ.ఐదు వేలకు ఊడిగం చేసే ఉద్యోగం. ఐదు లక్షల మంది వలంటీర్లకు ప్రజల డబ్బుతో జీతం ఇస్తున్నారు. వలంటీర్లు ప్రభుత్వోద్యోగులు కానప్పుడు.. ప్రభుత్వంలో అనేక వ్యవస్థలు ఉన్నప్పుడు వలంటీర్లతో అసలు పనేముంది?’.. అంటూ జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ వలంటీరు వ్యవస్థపై మరోసారి నోరుపారేసుకున్నారు. ఏలూరు నగరంలో సోమవారం సాయంత్రం జరిగిన నియోజకవర్గస్థాయి కార్యకర్తలు, వీర మహిళల సమావేశంలో పవన్ మాట్లాడారు. ఆయన ఏమన్నారంటే.. జనసైనికులు అవసరమైతే వలంటీర్లను నిలదీయాలి. ఏపీలో ఎంతమంది అమ్మాయిలు మిస్సవుతున్నారో ఆ డేటా మీ దగ్గర ఉందా అని, నిఘా వర్గాల్లో ముఖ్యులు నన్ను అడిగితే నా మతిపోయింది. ప్రతి గ్రామంలో పదిమంది యువకులు వలంటీర్ల పేరుతో ఇంటింటికీ తిరుగుతూ సున్నితమైన సమాచారాన్ని సేకరిస్తున్నారు. భార్యాభర్తల మధ్య గొడవలున్నాయా.. వితంతు మహిళలున్నారా, భర్తలు బయటకు వెళ్లాక భార్యలు ఏం చేస్తున్నారు? ఇలా సున్నితమైన సమాచారాన్ని సేకరిస్తున్నారు. వలంటీర్ల వ్యవస్థ పెట్టిన మొదట్లో జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ బలోపేతానికి అని అనుకున్నాం. కానీ, ఇది చాలాచాలా భయంకరమైన వ్యవస్థగా మారిపోయింది. ఇది అందరి వలంటీర్ల గురించి కాదు.. కొందరి గురించే. అయితే, డేటా మాత్రం కచ్చితంగా వెళ్తోంది. వలంటీర్లు తప్పుచేస్తే ఎవరికి చెప్పాలి. వారేమో ప్రభుత్వోద్యోగులు కాదంటారు. వలంటీర్లు ఇబ్బంది పెడుతుంటే టోల్‌ఫ్రీ నంబర్ ఉండాలి. ఇక రేషన్ డీలర్ల వ్యవస్థను చంపేసి 10 వేల వ్యాన్లు ఇచ్చారు. ఈ వ్యవస్థపై పర్యవేక్షణలేదు. వితంతు మహిళలు, ఒంటరి మహిళలు జాగ్రత్తగా ఉండాలి.

జిల్లా వార్తలు

ఓపెన్ స్కూల్స్ ప్రవేశాలు ప్రారంభం

ఖమ్మంసహకారనగర్/కొత్తగూడెంఅర్బన్: తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ద్వారా పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఈ.సోమశేఖరశర్మ, ఓపెన్ స్కూల్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ మద్దినేని పాపారావు తెలిపారు. పదో తరగతిలో ప్రవేశానికి 14 ఏళ్లు, ఇంటర్‌లో 15 ఏళ్లు నిండిన వారు అర్హులని తెలిపారు. పదో తరగతిలో ప్రవేశానికి జనరల్ పురుషులైతే రూ.1,550, ఇంటర్‌లో ప్రవేశాల కోసం రూ.1,800, పదో తరగతిలో చేరేందుకు మహిళలు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ, మైనార్టీ అభ్యర్థులు రూ.1,150, ఇంటర్‌లో ప్రవేశాల కోసం రూ.1,500 ఫీజు చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. వచ్చే నెల 10వ తేదీ వరకు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా ఫీజు చెల్లించవచ్చని, ఆగస్టు 11నుంచి 31వ తేదీ వరకు అపరాధ రుసుంతో ఫీజు చెల్లింపునకు అవకాశముందని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు టీఎస్ ఆన్‌లైన్, మీ సేవ, ఏపీ ఆన్‌లైన్, తెలంగాణ ఓపెన్ స్కూల్ వెబ్‌సైట్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకుని ఫీజు చెల్లించాక దరఖాస్తు ఫారం, ధ్రువపత్రాలతో సెంటర్లలో సంప్రదించాలని, వివరాలకు 80084 03522 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

పురోహితుల క్రికెట్ టోర్నీ విజేత మోపిదేవి జట్టు



మోపిదేవి జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న నిర్వాహకులు

ఖమ్మం స్పోర్ట్స్: ఖమ్మం స్తంభాద్రి పురోహితుల సంఘం ఆధ్వర్యంలో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ స్థాయి క్రికెట్ పోటీలు సోమవారం ముగిశాయి. ఖమ్మంలోని సర్దార్ పటేల్‌స్టేడియంలో జరిగిన ఈ పోటీల్లో విజేతగా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మోపిదేవి జట్టు నిలిచింది. అలాగే, ద్వితీయస్థానంలో మహాదేవ్ హైదరాబాద్ జట్టు, మూడోస్థానంలో అన్నవరం, నాలుగోస్థానంలో విజయవాడ జట్లు నిలవగా ట్రోఫీలు అందజేశారు. డాక్టర్ కూరపాటి ప్రదీప్‌కుమార్, ఎం.డీ.మతిన్, ఓలేటి సాంబమూర్తి, పోటీల నిర్వాహకులు ప్రకాంతాచార్యులు, శేషాభట్టర్, రంగావఝ్జల దిలీప్‌శర్మ, అవధానుల సాయినాథ్ వర్మ, అనిరుధ్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికుల కన్నీటి వేదన



కనీస వేతనాల కోసం పోస్టుకార్డ్ ఉద్యమం చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు (ఫైల్)

- సింగరేణిలో అందని కనీస వేతనాలు
- సంస్థవ్యాప్తంగా 32 వేల మంది కార్మికులు
- కోలిండియా పరిధిలో అమలవుతున్నా సింగరేణిలో మొండిచేయి

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ వ్యాప్తంగా సుమారు ఇరవై ఏళ్ల క్రితం 1.16లక్షల మంది పర్మనెంట్ కార్మికులు విధులు నిర్వర్తించగా.. ఆ సమయాన లోడింగ్, అన్ లోడింగ్, శ్యాండ్ బంకర్లు, బొగ్గు రవాణా విభాగాల్లో మాత్రమే వంద మంది వరకు కాంట్రాక్ట్ కార్మికులు పని చేసేవారు. కానీ నేడు సింగరేణి వ్యాప్తంగా 42వేల మంది పర్మనెంట్ కార్మికులు, 32 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులు పనిచేస్తున్నారు. అంటే పర్మనెంట్ కార్మికుల సంఖ్యను గణనీయంగా తగ్గించి కాంట్రాక్ట్ కార్మికుల సంఖ్యను పెంచుతూ వెళుతున్నట్లు ఈ గణాంకాల ద్వారా తెలుసుకోవచ్చు. కానీ వీరికి వేతనాల చెల్లింపులో మాత్రం సవతి తల్లి ప్రేమనే కనబరుస్తుందన్న విమర్శలు వస్తున్నాయి. కనీస వేతనాల మాటేమో కానీ ఇతర సౌకర్యాల అమలులో కూడా యాజమాన్యం విఫలమైందని కాంట్రాక్ట్ కార్మిక సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యాన కాంట్రాక్ట్ కార్మికులకు హైపవర్ కమిటీ సూచనల మేరకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలనే డిమాండ్‌తో సింగరేణివ్యాప్తంగా కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు ఆందోళనలు చేపడుతున్నారు.

ఆరు విభాగాల్లో తప్ప...

సింగరేణిలో పనులు 56కి పైగా విభాగాల ద్వారా సాగుతున్నాయి. ఇందులో ఆరు తప్ప మిగతా విభాగాల్లో కాంట్రాక్ట్ కార్మికులదే కీలకపాత్ర అని చెప్పాలి. అంతేకాక ఏటా అప్రెంటిస్ షిప్ ద్వారా కొత్త వారిని నియమిస్తూ గనులు, వర్క్‌షాప్‌ల్లో నేర్పిస్తూ పని చేయిస్తున్నారు. ఇలా సింగరేణి వ్యాప్తంగా వివిధ రీజియన్లలో 32 వేల మంది కాంట్రాక్టు కార్మికులు పని చేస్తున్నారు. వీరిలో అన్‌స్కిల్డ్ కార్మికులకు రోజూ రూ.437, సెమీ స్కిల్డ్ కార్మికులకు రూ.510, స్కిల్డ్ కార్మికులకు 610 చెల్లించాల్సి ఉంటుంది. కానీ సోలార్, లోడింగ్, అన్ లోడింగ్, సులభ్ కాంప్లెక్స్, నర్సరీ, సివిక్ విభాగాలలో ఇవి అమలు చేయటం లేదు.

అమలు కాని హైపవర్ కమిటీ సూచనలు

సింగరేణిలో కాంట్రాక్ట్ కార్మికులకు హైపవర్ వేతనాలు అమలు చేయాలని 2013లో జరిగిన 8వ వేతన ఒప్పంద సమావేశంలో సూచించారు. తద్వారా కోలిండియా వ్యాప్తంగా బొగ్గు పరిశ్రమల్లో కాంట్రాక్ట్ కార్మికులకు రోజుకు రూ.930 చెల్లించాల్సి ఉంటుంది. ఈ నిర్ణయం కోలిండియా పరిధిలోని పరిశ్రమల్లో అమలవుతున్నా సింగరేణిలో మాత్రం అమలుకు నోచుకోలేదు. అంతేకాక బొగ్గు ఉత్పత్తి ప్రాంతాలు, అండర్ గ్రౌండ్‌లో పర్మనెంట్ కార్మికులతో సమానంగా కాంట్రాక్ట్ కార్మికులకు వేతనం అమలు చేయాలని 2016లో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినా కూడా అమలుకాకపోవడం గమనార్హం. కాగా, కోలిండియా పరిధిలోని ఇతర సంస్థల్లో మాత్రం కాంట్రాక్ట్ కార్మికులకు పర్మనెంట్ కార్మికులతోపాటు సమానంగా సౌకర్యాలు కల్పిస్తూనే వేతనాలు చెల్లిస్తున్నారు. అంతేకాకుండా ప్రతి నెల రూ.3,500 అలవెన్స్ కూడా అందుతోంది. కానీ సింగరేణిలో అలా చేయకపోవడంతో కార్మికులు ఆవేదన చెందుతున్నారు. ఈ విషయమై జీఎం పర్సనల్ (ఐఆర్‌పీఎం) బి.హన్మంతరావును వివరణ కోరగా.. సింగరేణిలో కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు, సౌకర్యాల విషయమై త్వరలోనే కమిటీ వేయనున్నామని తెలిపారు.

ఒకటో కేటగిరీ వేతనం అమలుచేయాలి



సింగరేణిలో హైపవర్ వేతనాలు, సమాన పనికి సమాన వేతనం అమలుచేయాలి. ఎన్నిమార్లు విన్నవించినా ఈ విషయంలో సంస్థ తాత్సారం చేస్తున్న నేపథ్యాన కాంట్రాక్ట్, జాతీయ కార్మిక సంఘాల సమన్వయంతో ఆందోళనలు చేపడుతాం. సమ్మెకైనా వెనుకాడేది లేదు.

– ఎస్.సంజీవ్, ఇఫ్టూ నాయకుడు

కోలిండియాలో మాదిరి చెల్లించాలి



సింగరేణిలోని కాంట్రాక్ట్ కార్మికులకు కోలిండియా మాదిరిగా రోజుకు రూ.950 చెల్లించాలి, ఇప్పటికే కేంద్ర కనీస వేతనాల చైర్మన్‌తో ఈ విషయమై చర్చించాం. కాంట్రాక్ట్ కార్మికులకు సెలవులు, పెన్షన్, మెరుగైన వేతనాలు అందించాలనే డిమాండ్‌తో ఆందోళనలు చేపడతాం.

– మాధవనాయక్, ఏటీకేఎంఎస్ నాయకుడు

అరకొర వేతనాలతో ఇబ్బంది

సింగరేణిలో ఉద్యోగమంటే బతుకులకు భరోసా అనుకున్నాం. కానీ యాజమాన్యం కొంత, కాంట్రాక్టర్లు మరికొంత మాకు అన్యాయం చేస్తున్నారు. అరకొర వేతనాలు చెల్లిస్తుండడంతో ఇబ్బందిగా ఉంది. ఇకనైనా ఉన్నతాధికారులు చొరవ తీసుకుని న్యాయం చేయాలి.

– ఈ.నాగేశ్వరరావు, కాంట్రాక్ట్ ఉద్యోగి

కార్మికుల సమస్యల పరిష్కారంపై దృష్టి సారించండి



ధర్నా శిబిరంలో మాట్లాడుతున్న పోటు రంగారావు

ఇల్లెందు: గ్రామపంచాయతీల కార్మికులు, మధ్యాహ్న భోజనం వర్కర్లకు చట్టపరమైన హక్కులు కల్పిస్తూ వారి సమస్యలు పరిష్కరించాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు డిమాండ్ చేశారు. ఇల్లెందులో గ్రామపంచాయతీ వర్కర్లు, మధ్యాహ్న భోజన వర్కర్ల నిరసన శిబిరాలను సోమవారం ఆయన సందర్శించి సంఘీభావం తెలిపి మాట్లాడారు. పంచాయతీ కార్మికులు, మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని విడనాడి తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, నాయకులు నాయిని రాజు, పూనెం కుమార్, శాంతయ్య, ఈసం శంకర్, అజయ్, బుర్ర వెంకన్న, పాయం వెంకన్న, యాకుబ్‌షావలీ, బొర్రా వెంకన్న, తెల్లం రాజు పాల్గొన్నారు.

స్పెషలిస్ట్ వైద్యుల నియామకానికి ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న డైరెక్టర్ బలరామ్, అధికారులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి పరిధిలోని ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న స్పెషలిస్ట్ వైద్యుల నియామకానికి సోమవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయంలో డైరెక్టర్(పా) ఎన్.బలరాం ఈ ఇంటర్వ్యూలు నిర్వహించగా జీఎం పర్సనల్(ఐఆర్‌పీఎం) కట్టా బసవయ్య, సీఎంఓ బి.వెంకటేశ్వరరావు, డీజీఎం దన్‌పాల్ శ్రీనివాస్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు. మొత్తం 25 పోస్టులను ఏడాది కాలానికి భర్తీ చేయనుండగా తొలిరోజు హాజరై ఇరవై మంది సర్టిఫికెట్లు పరిశీలించారు.

ఆన్‌లైన్‌లో క్వార్టర్ల వివరాలు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ పరిధిలో నిర్మించిన క్వార్టర్ల వివరాలను ఇక నుంచి ఆన్‌లైన్‌లో పొందుపర్చనున్నారు. ఈమేరకు సోమవారం డైరెక్టర్ బలరామ్ క్వార్టర్ల వివరాలతో పాటు కార్మికుల సీనియారిటీ జాబితాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశారు. తద్వారా క్వార్టర్ల అన్యాక్రాంతం కాకుండా చూడడంతో పాటు దరఖాస్తులు, కేటాయింపు వివరాలను ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అధికారులు కట్టా బసవయ్య, మురళీధర్, హరప్రసాద్, వేణు తదితరులు పాల్గొన్నారు.


భద్రాద్రి జిల్లాలో తమిళనాడు పీసీసీఎఫ్ పర్యటన



భద్రాద్రి రామాలయంలో తమిళనాడు పీసీసీఎఫ్ రాజేశ్వరితో ఈఓ రమాదేవి, తదితరులు

భద్రాచలం/దుమ్ముగూడెం/పాల్వంచ రూరల్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో తమిళనాడు అటవీశాఖకు చెందిన ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ పి.రాజేశ్వరి సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె ఏపీకి చెందిన వైద్య, ఆరోగ్య శాఖ జేడీ కె.అరుణాదేవితో పాటు హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ సి.హేమ, డాక్టర్ అనురాధ, భద్రాచలం ఆర్డీఓ రత్నకళ్యాణితో కలిసి భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రదక్షిణ అనంతరం అంతరాలయంలో మూలమూర్తులకు పూజలు చేయగా, పండితులు వేదాశీర్వచనం, ఈఓ రమాదేవి స్వామి వారి ప్రసాదం, జ్ఞాపికలు అందచేశారు. అలాగే, దుమ్ముగూడెం మండలం పర్ణశాలలో కూడా శ్రీ సీతారామచంద్రస్వామి వారిని దర్శించుకుని పంచవటీ కుటీరం, నారచీరల ప్రాంతాల విశిష్టతలు తెలుసుకున్నారు. అనంతరం పాల్వంచ మండలం కిన్నెరసానిలో పర్యటించిన వారు డీర్‌పార్కులోని దుప్పులు, ప్రాజెక్టు పైనుంచి జలాశయం, పర్యావరణ కేంద్రాన్ని వీక్షించి రిజర్వాయర్‌లో బోటు షికారు చేశారు. అటవీ, రెవెన్యూ శాఖల అధికారులు లక్ష్మయ్య, శ్రీను, నందా, శ్రీనివాసరావు, రవికుమార్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేతలపై కేసులు ఎత్తివేయాలి



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ కనకయ్య

కామేపల్లి(కారేపల్లి): అధికారపార్టీ నేతల సూచనలతో పోలీసులు అత్యుత్సాహంగా కాంగ్రెస్ నాయకులపై కేసులు బనాయించి ఇబ్బంది పెడుతున్నారని భద్రాద్రి కొత్తగూడెం జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య ఆరోపించారు. కామేపల్లి మండలంలోని తాళ్లగూడెం పోలీసుస్టేషన్ సమపాన ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఇటీవల పండితాపురంలో జరిగిన ఘర్షణతో తమ పార్టీ నాయకుడు, డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబుయాదవ్‌కు సంబంధం లేకున్నా పోలీసులు ఆయనపై కేసు నమోదు చేశారన్నారు. బీఆర్ఎస్ ప్రజాప్రతినిధుల సూచనలతో పోలీసులు వాస్తవాలకు పట్టించుకోవడం లేదని, ఇకనైనా తీరు మార్చుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు తుంబూరి దయాకర్‌రెడ్డి, షేక్ ఫతే అహ్మద్, మేకల మల్లికార్జున్, శీలం పుల్లయ్య, శ్రీను, ప్రసాద్, నాగేంద్రబాబు, వేణు, నాగేశ్వరరావు, శేఖర్, నరేష్, ఇమ్మడి తిరుపతిరావు, మల్లెల నాగేశ్వరరావు పాల్గొన్నారు.